## అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



అధికారులు, కాలనీవాసులతో చర్చిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**వనస్థలిపురం:** అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదానగర్ కాలనీలో నూతనంగా సీసీ రోడ్ల పనులు ప్రారంభం కానున్న సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి పనులపై సమీక్షించారు. వెంటనే పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ హేమునాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం



నూతనంగా ఎన్నికైన శైలజాపురికాలనీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు

**మన్సూరాబాద్:** శైలజాపురికాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కాలనీ కమ్యూనిటీహాల్‌లో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రదీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథ్, వర్కింగ్ ప్రధాన కార్యదర్శిగా రవి, కోశాధికారిగా మార్కండేయులుతో పాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ..కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



దుస్తులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట:** మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్‌లోని సలీంఖాన్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్, మెహందీ, వంటల శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి డివిజన్లలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మహిళలు ఉచిత టైలరింగ్ సెంటర్లలో శిక్షణ పూర్తి చేసుకుని జీవనోపాధి పొందడంపై ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. టైలరింగ్ సెంటర్‌లో కుట్టిన దుస్తులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ నజీమా షరీఫ్, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణం



**సైదాబాద్:** ఆపరేషన్ సిందూర్‌తో మన త్రివిధ దళాలు దేశం ప్రజలు గర్వపడేలా చేశారని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం సందర్భంగా సోమవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని ఫోకస్ హాస్పిటల్ నుంచి ఐఎస్‌సదన్ చౌరస్తా వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు, కాలనీవాసులు, మహిళలు పెద్దసంఖ్యలో ర్యాలీలో పాల్గొని జాతీయ జెండాలు చేతబూని దేశభక్తి నినాదాలతో హోరెత్తించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై తిరుగులేని పోరాటం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి దేశ ప్రజలందరూ మద్దతు పలకాలన్నారు.

## విద్యార్థులకు అభినందన

**పహాడీషరీఫ్:** బాలాపూర్ మండల పరిధిలోనే పది ఫలితాల్లో మామిడిపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సత్తాచాటడం అభినందనీయమని గ్రామ మాజీ కార్పొరేటర్లు చుక్క శివకుమార్, ఈరంకి వేణుకుమార్‌గౌడ్ పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో సోమవారం పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షీల్డ్‌లను బహూకరించారు. వారు మాట్లాడుతూ.. మండల స్థాయిలో గ్రామ పాఠశాల విద్యార్థి ఉత్తమ ర్యాంక్ సాధించడం గర్వకారణమన్నారు.

# రోడ్డు దాటాలంటే దడ

## విజయవాడ రహదారిపై కనిపించని వేగనియంత్రణ

- దూసుకెళ్తున్న వాహనాలు
- జంకుతున్న పాదచారులు

**హస్తినాపురం:** విజయవాడ జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణ పనులతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించి పాదచారులు రోడ్డు దాటాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది. విజయవాడ జాతీయ రహదారిపై చింతల్‌కుంట చెక్‌పోస్టు నుంచి మొదలుకొని పనామా చౌరస్తా, సుష్మాచౌరస్తా ఆటోనగర్, హైకోర్టుకాలనీ, భాగ్యలతకాలనీ, హయత్‌నగర్ డిపో, హయత్‌నగర్‌లో రోడ్డుపై రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీతో రోడ్డు దాటాలంటేనే కనీసం 10–20 నిమిషాల సమయం పడుతోంది.



వనస్థలిపురం పనామా చౌరస్తా మలుపు వద్ద వాహనాల రద్దీ

### ఎఫ్ఓబీలు నిర్మిస్తేనే..

విజయవాడ రహదారిపై నిత్యం రద్దీగా ఉండే వనస్థలిపురం, పనామాచౌరస్తా, చింతల్‌కుంట,ఆటోనగర్,హయత్‌నగర్, తదితర ప్రాంతాలలో ఫుట్ ఓవర్‌బ్రిడ్జిలను నిర్మిస్తేనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని పాదచారులు కోరుతున్నారు. ఆటోనగర్, హైకోర్టు కాలనీ,హయత్‌నగర్,వనస్థలిపురం,చింతల్‌కుంట తదితర ప్రాంతాల్లో విజయవాడ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కాలనీలకు బస్సు దిగి వెళ్లాలంటేనే ప్రజలు వాహనాల రద్దీని చూసి బెంబేలెత్తుతున్నారు. రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నప్పటికీ ఈ రోడ్డును ప్రజలు ఏ విధంగా దాటుతారన్న విషయం అధికారులకు అర్థం కాకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. విజయవాడ రహదారిపై రోడ్డు దాటుతున్న సమయంలో చాలా ప్రాంతాల్లో ప్రమాదాల జరుగుతున్నాయని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వనస్థలిపురం జాతీయ రహదారి

### చర్యలు తీసుకుంటున్నాం..

విజయవాడ జాతీయ రహదారిపై వేగనియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. పాదచారుల సౌకర్యార్థం విజయవాడ జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో ఎఫ్ఓబీలు ఏర్పాటు చేయాలని జీహెచ్‌సీఎంసీ, జాతీయ రహదారుల సంస్థకు లేఖలు రాశాం. హయత్‌నగర్ వర్ధ్అండ్‌డీడ్ దగ్గర ఫుట్ ఓవర్‌బ్రిడ్జి పనులు ప్రారంభించడం జరిగింది. హయత్‌నగర్‌లోని భాగ్యలతకాలనీ దగ్గర కూడా ఫుట్ ఓవర్‌బ్రిడ్జిని నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి పలు కారణాలతో పనులు జరగడం లేదు. పాదచారులు రోడ్డు దాటేలా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తాం.



– భూపతి గట్టుమల్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

## సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలి

**నాగోలు:** విద్యార్థులు కొత్త ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని ఢిల్లీలోని డీఆర్‌డీఓలోని స్పిక్ ల్యాక్ డైరెక్టర్ డాక్టర్ మాణిక్యవాసగం అన్నారు. ఆదివారం రాత్రి ఎల్‌బీనగర్‌లో నిర్వహించిన బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ఐదో అంతర్జాతీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు దేశ భద్రత, సామాజిక శాస్త్ర, విద్యా, వైద్య కోసం కొత్త పరిశోధనలు చేయాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించుకొని నూతన ఆవిష్కరణలు ఎలా చేయాలో నేర్చుకోవాలని సూచించారు. మైక్రోస్థాయిలో పరిశోధనలు చేయాలని వాతావరణ శాఖ కేంద్ర డైరెక్టర్ డాక్టర్ నాగరత్న సూచించారు. మాజీ ఎమ్మెల్సీ రామ్‌చందర్‌రావు మాట్లాడుతూ.. అన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులను పరిశోధనల కోసం ప్రోత్సహించాలన్నారు. బెస్ట్ ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయం చైర్మన్ భరత్‌లాల్ మీనా మాట్లాడుతూ.. పరిశోధనలో కొత్తదనం తీసుకురావడంలో కోసం తమ కాలేజీ పని చేస్తుందని తెలిపారు. ఈ సదస్సులో యుకే, శ్రీలంక, దుబాయ్, అమెరికా ఇతర దేశాల విద్యార్థులు తమ పరిశోధనలు పంపినట్లు ఆయన తెలిపారు. అనంతరం పరిశోధనల సావనీర్‌ను విడుదల చేశారు.



సావనీర్‌ను విడుదల చేస్తున్న వక్తలు

## రైతు బజారులలో కూరగాయల ధరలు

**వనస్థలిపురం:** సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజారులలో కూరగాయల ధరలు (కిలో..రూపాయల్లో) టమాట 13, వంకాయ 18, బెండ 38, పచ్చి మిర్చి 45, కాకర 32, బీర 35, క్యాబేజీ 9, ఫ్రెంచిబీన్స్ 85, క్యారెట్ 28, దొండ 19–23, చిక్కుడు 65, గోకర 35, బీట్‌రూట్ 17, క్యాప్సికం 47, ఆలుగడ్డ 25, దోస 18, సొరకాయ 9, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 17, చామగడ్డ 35. గమనిక: ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

## నూతన కమిటీ ఏకగ్రీవం

**చంపాపేట:** చంపాపేట డివిజన్ శిఖరాఎన్‌క్లేవ్ కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధుల ఎన్నిక సోమవారం స్థానిక కాలనీ సంక్షేమ సంఘ భవనంలో ఏకగ్రీవంగా జరిగింది. కాలనీ అధ్యక్షుడిగా చల్లా శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా రఘుపతిరెడ్డి, కోశాధికారిగా వెంకటరెడ్డిని కాలనీవాసులు ఎన్నుకున్నారు.



శ్రీనివాసరెడ్డి

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



నియామక పత్రాలు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

**నాగోలు:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ మహిళా విభాగ్ రాష్ట్ర కార్యవర్గం సభ్యులకు సోమవారం ఆయన నియామక పత్రాలను అందజేశారు. ప్రచార కమిటీ చైర్‌పర్సన్‌గా ములుగు శ్రీలత, కోఆర్డినేటర్ పద్మజ, పీఆర్‌ఓగా స్వాతి, ఈసీ మెంబర్‌గా నాగమని, అడ్వైజర్‌గా ఏపూరి రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షులుగా గోలి శ్రీలత, వావిలాల వినోద లలిత, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా సంయుక్త, ప్రధాన కార్యదర్శిగా అనూష, కోశాధికారి శ్వేత, పీఆర్‌ఓగా సాయి సర్గి, పొలిటికల్ కమిటీ చైర్మన్‌గా సత్యకళ, ప్రధాన కార్యదర్శిగా లావణ్య, సేవాదల్ కమిటీ చైర్మన్ మాధురికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ గుప్తా, కటకం శ్రీనివాస్, చింతల రజినీకాంత్ గుప్తా, లోకేష్, స్వప్న పాల్గొన్నారు.

## ‘ఎల్‌ఆర్‌ఎస్‌లకు స్పందన అంతంతే’

**చాదర్‌ఘాట్:** మలక్‌పేట సర్కిల్–6లో ఎల్‌ఆర్‌ఎస్ పథకానికి స్పందన అంతంతే ఉందని సర్కిల్–6 ఏసీపీ గజానంద్ తెలిపారు. సోమవారం ఆయన మలక్‌పేటలో మాట్లాడుతూ..సర్కిల్–6 పరిధిలో 618 అప్లికేషన్స్ వచ్చాయని, 28 మంది మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు కట్టారని తెలిపారు. 590 మందికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. పలుమార్లు ఫోన్ చేసినా వినియోగదారుల నుంచి స్పందన రావడం లేదని పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీ వరకు ఎల్‌ఆర్‌ఎస్‌కు వెసులుబాటు ఉందని తెలిపారు. 25 శాతం రిబేటు ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏసీపీ గజానంద్ సూచించారు.

## రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



శిబిరాన్ని సందర్శించిన కార్పొరేటర్ చింతల అరుణ

**నాగోలు:** మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. బ్లెండ్స్ కాలనీలో డాక్టర్ చిరుగుపాటి ప్రజ్ఞ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు రొమ్ము కేన్సర్ పరీక్షలు, అవగాహన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రొమ్ము కేన్సర్ 50 ఏళ్ల అంత కంటే ఎక్కువ వయస్సు ఉన్న మహిళలను ప్రభావితం చేస్తుందన్నారు. కణితులను తొలగించడానికి శస్త్రచికిత్స ద్వారా లేదా కేన్సర్ కణాలను చంపడానికి చికిత్స ద్వారా రొమ్ము కేన్సర్‌కు చికిత్స చేయవచ్చాన్నారు. అనంతరం డాక్టర్ ప్రజ్ఞా రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సామ రంగారెడ్డి, సరస్వతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

**మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య**

**మహేశ్వరం:** నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో 52 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలను న్యాయం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు, బీసీ, ఓసీలకు రూ.5లక్షలు ఆర్థిక సహాయం అందించనుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరాగాంధీ హయాంలో పేదలకు భూములు పంపిణీ, ఇళ్ల స్థలాలు, ఇళ్లు పంపిణీ చేసిందన్నారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. అంతకుముందు గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఆయన అధికారులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ సైదులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆవుల యాదయ్య, గల్లా యాదయ్య, ఆవుల రఘుపతి, వర్కల రమేష్‌గౌడ్, ఎర్ర చంద్రమోహన్, కడల భాస్కర్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐతాబాద్ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి నవీన్, బాల్‌రాజ్, ఎండీ. షఫీ, మల్లేశ్, రాజుగౌడ్, శ్రీను, బాబు పలువురు పాల్గొన్నారు.

**కోళ్లపడకల్, గొల్లూర్ గ్రామాల్లో..**

మండల పరిధిలోని కోళ్లపడకల్, గొల్లూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంచాయతీ కార్యదర్శులు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కల్పన, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ, మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెండ్యాల బాల్‌రాజ్, నాయకులు హరినాద్ గౌడ్, యాదయ్య, భాస్కర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## స్ట్రామ్ వాటర్ లైన్ పనులు పూర్తి చేయాలి

**చైతన్యపురి:** సరూర్‌నగర్ చెరువు నుంచి హుస్సేన్ మటన్ షాప్ వరకు చేపట్టిన స్ట్రాం వాటర్‌లైన్ పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్ సోమవారం జీహెచ్ఎంసీ ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌ను కలిసి సరూర్‌నగర్ చెరువు లోతట్టు కాలనీలు వరద ముంపునకు గురి కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే న్యూ గడ్డిఅన్నారం కాలనీలో జరుగుతున్న స్టాం వాటర్‌లైన్ మరమ్మతులు చేయటంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పనులు ఆలస్యం కావడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డివిజన్ పరిధిలోని మధురాపురి, శ్రీకృష్ణానగర్, కాలనీ, పీఅండ్‌టీ కాలనీ చౌరస్తాతో పాటు మరి కొన్ని కాలనీల్లో నూతన సీసీ రోడ్డు పనులకు జీహెచ్ఎంసీ నిధులు మంజూరు అయినా పనులు పూర్తి కాలేదని తగు చర్యలు తీసుకోవాలని జెడ్సీని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులపై అధికారులతో సమీక్ష చేసి పూర్తి అయ్యేలా చూస్తానని జెడ్సీ హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.



పెండింగ్ పనుల గురించి జెడ్సీకి వివరిస్తున్న కార్పొరేటర్

## ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలందించాలి

**సైదాబాద్:** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి కేంద్రం సిబ్బందికి సూచించారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని క్రాంతినగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం కార్పొరేటర్ ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది సమయ పాలన, రోగులకు అందుతున్న సౌకర్యాల గురించి కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు వారి సహాయకులతో సత్ప్రవర్తనతో మెలగాని ఆమె సూచించారు. ఆరోగ్య కేంద్రంలో ఎలాంటి అదనపు వసతులు కావాలంటే తన దృష్టికి తీసుకు వస్తే వైద్యశాఖ అధికారులతో చర్చించి వాటిని ఏర్పాటు చేస్తానని కార్పొరేటర్ తెలిపారు.



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ అరుణారవీందర్‌రెడ్డి

## పేదల అభ్యున్నతికి పుచ్చలపల్లి సుందరయ్య కృషి



సుందరయ్య చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న చంద్రమోహన్



నినాదాలు చేస్తున్న నాయకులు

**హస్తినాపురం:** జీవితాంతం పీడిత ప్రజల కోసం పోరాటం చేసిన మహోన్నతమైన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని రంగారెడ్డి జిల్లా సీపీఎం పార్టీ కార్యవర్గ సభ్యులు చంద్రమోహన్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని సాగర్‌రింగ్‌రోడ్డులోని చౌరస్తాలో ఎల్‌బీనగర్ సర్కిల్ సీపీఎం పార్టీ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలో చంద్రమోహన్ పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించడమే కాకుండా వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాటం చేసి 10 లక్షల ఎకరాల భూములను పేద ప్రజలకు పంపిణీ చేసిన యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. చట్టసభల్లో వ్యక్తులపై వ్యక్తిగత విమర్శలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకు వస్తున్న విధానాల ప్రాతిపదికగా అర్థవంతమైన రీతిలో ప్రజా సమస్యలను చర్చించి పార్లమెంట్‌ను ప్రజా సమస్యల చర్చావేదికగా నిలిపారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్, రామస్వామి, దుర్గారావు, మంతాని యాదయ్య, గడ్డం రవీందర్, బి.కాశయ్య, లక్ష్మయ్య, రాధమ్మ, గంగమ్మ, ఎల్లమ్మ, చిరంజీవి పాల్గొన్నారు.

**నాగోలులో..**

**నాగోలు:** పేదప్రజల సమస్యలపై పోరాడిన యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సింరెడ్డి అన్నారు. సోమవారం నాగోలులో పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించిన సుందరయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సుందరయ్య ఆశయ సాధన అంటే నిరంతరం పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాల కోసం పాటు పడటమే అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేశం, ఎల్లయ్య, కృష్ణయ్య, మల్లేశం, చైతన్య పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డా.వాణి

**జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త డా.వాణి**

**మహేశ్వరం:** వానాకాలం పంటకు ముందు రైతులు పొలాల్లో పచ్చిరొట్ట పైర్లను సాగు చేసుకుంటే భూసారం పెరుగుతుందని జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త డా.వాణి సూచించారు. సోమవారం మండల పరిధిలోని నందుపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించి వ్యవసాయ, ఉద్యానవన శాస్త్రవేత్తలతో రైతులు సాగులో పాటించాల్సిన సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్షలను చేసి వాటి ఆధారంగా వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలను సాగు చేసుకోవాలన్నారు. వానాకాలం పంటలు సాగు చేసే ముందు పచ్చిరొట్ట పైర్లను సాగు చేసుకుంటే భూమి సారవంతం అవుతుందన్నారు. రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను వాడితే పంట దిగుబడి అధికంగా రావడంతో పాటు తెగుళ్లు సోకవన్నారు. రైతులు ఎప్పుడు ఒకే విధమైన పంటను సాగు చేయొద్దని, పంటలను మార్చితే దిగుబడి వస్తుందన్నారు. ఈ ప్రాంతం హైద్రాబాద్‌కు దగ్గర్లో ఉండడంతో ఉద్యాన పంటలు సాగు చేసుకుంటే అధిక లాభాలు వస్తాయన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా కూరగాయ, పండ్ల తోటల పెంపకం చేపట్టాలన్నారు. అంతకుముందు రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవశాఖ శాస్త్రవేత్త డా.రజిని, మండల వ్యవసాయాధికారి నాగమణి, ఏఈఓ దీనా, పంచాయతీ కార్యదర్శి జానయ్య, మాజీ ఉపసర్పంచ్ ఎండీ.ఉస్మాన్, రైతులు దేశపాగ కిష్టయ్య, విఠల్‌గౌడ్, దేశపాగ జంగయ్య, అలీ, చోటు పలువురు పాల్గొన్నారు.

## ముగిసిన వీబీఎస్



**మలక్‌పేట:** మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్‌లోని చర్చ్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీలో వారం రోజులు వెకేషన్ బైబిల్ స్కూల్ (వీబీఎస్) జరిగింది. పిల్లలకు ఫన్ గేమ్స్, బైబిల్ స్టోరీస్, డ్యాన్స్, మ్యూజిక్ నేర్పించి పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి మినిస్ట్రీ నిర్వాహకులు పాస్టర్, రెవరెండ్ కూనదొడ్డి యిర్మియా బహుమతులు అందజేశారు. సిస్టర్ సదమాల ప్రత్యేక ప్రార్థనలు చేశారు.